

వైఎస్‌ఆర్

ఆర్‌జెడిగా శామ్యూల్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శామ్యూల్

ప్రజాశక్తి-కడప అర్బన్

పాఠశాల విద్య ఆర్‌జెడిగా శామ్యూల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఆర్‌జెడిగా కొనసాగిన శామ్యూల్‌ను ప్రభుత్వం రెగ్యులర్ ఆర్‌జెడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్‌జెడిగా బాధ్యతలు స్వీకరించిన శామ్యూల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంఎస్‌ఎంఇ ఉన్నట్లా..లేనట్లా.!

- ఇరకాటంలో కూటమి ఎమ్మెల్యేలు
- అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణేదీ?
- గండికోట అదనపు పరిహారం చెల్లింపులేవీ
- నేడు మైదుకూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు

కొప్పర్తి ఎంఎస్‌ఎంఇ పార్కును తరలిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒను ఉపసంహరించుకున్నట్లా..లేనట్లా అనేది తెలియడం లేదు. నార్కోటిక్స్‌డ్రగ్స్ కోర్టును తిరుపతికి తరలించడాన్ని కూటమి ఎమ్మెల్యేలను జిల్లా ప్రజానీకం నిలదీస్తోంది. జిల్లా కేంద్రమైన కడపలో స్టోమ్‌వాటర్ డ్రెయిన్లు, రాజోలు, జొలదరాశి ప్రాజెక్టులు, అన్నమయ్య పునరుద్ధరణ పనులు చేపడతామనే హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనుల పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, బుగ్గవంక సుందరీకరణ, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీ పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఏడు నెలల కింద ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు శనివారం మైదుకూరు పర్యటన నేపథ్యంలో కథనం...



మైదుకూరులో సిఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/చాపాడు

జిల్లా ప్రగతి తిరోగమనబాట పట్టింది. రాష్ట్రంలో కూటమి సర్కారు రివర్స్‌గేర్‌లో సాగుతోంది. కొప్పర్తికి కేటాయించిన ఎంఎస్ ఎంఇఇ నాలెడ్జ్ పార్కు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం, ఎన్‌డిఎస్‌పి కోర్టును తరలించడంపై ప్రజాగ్రహం చాపకింద నీరులా సాగు తోంది. జిల్లాకు కొత్తగా పరిశ్రమలు ఇవ్వకపోయినా ఉన్న సంస్థలను వాటిని తరలించడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. చెన్నూరు సుగర్ పరిశ్రమ పునరు ద్ధరణ, జెఎస్‌డబ్ల్యు కంపెనీ ఉక్కు పరిశ్రమ, జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. 2007లో వైఎస్‌ఆర్ సర్కారు హయాం లో రూ.72 కోట్లతో కడపలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోల్డ్‌స్టోరేజీకి పరిమితమైంది. ఫలితంగా వర్షాకాలంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో మునకలు వేస్తుండడం పరిపాటిగా మారింది. రూ.70 కోట్ల విలువైన స్టోమ్ డ్రెయిన్‌ల ఏర్పాటు హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి కడప నగరం మునుగుతోంది. స్టోమ్‌డ్రెయిన్ కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ ఓ మూలకు పరిమితమైంది.

అద్దెగదుల్లోనే ఆర్కిటెక్చర్ చదువులు

రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ అద్దె గదుల్లోనే కాలం గడుపుతోంది. ఐదేళ్లగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశకే పరిమితమైంది. ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకారమవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. రూ.12కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు.

కొప్పర్తి పైప్‌లైన్ ప్రశ్నార్థకమే!

రూ.150 కోట్ల కొప్పర్తి పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత, పర్యావరణ అనుమతుల కారణంగా పారిశ్రామిక పురోగతి పడకేసింది. కొప్పర్తిలోని వైఎస్‌ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమల అవసరాలకు సరిపడా నీటి సదుపాయం అందడం లేదు. కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రొద్దుటూరులో మూలన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు.

పడకేసిన ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవు తాయో తెలియడం లేదు. జిల్లా నీటిపారుదలశాఖ రూ.212 కోట్ల ప్రతి పాదనల అనుమతుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రూ.82 కోట్లతో కూడిన మైలవరం రిజర్వాయర్ ఆధునీకరణ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు.

అందని పరిహారం

అన్నమయ్య, గండికోట, ఎన్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రెండేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘటనలో నష్టపోయిన వారికి ఎటువంటి న్యాయమూ జరగలేదు. ఐదు సెంట్లలో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. గండికోట నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమి తమైంది.రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారు

స్వచ్ఛాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మైదుకూరు పర్యటన ఖరారైంది. విజయవాడలో ఆయన ప్రారంభమైనప్పటి నుండి తిరిగి వెళ్లేంత వరకూ షెడ్యూల్‌ను సిఎం పేషి అధికారులు విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆయన ఇంటి నుండి బయలుదేరి 11 గంటలకు విజయవాడ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని 12 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్‌కు రానున్నారు. అక్కడ నుండి హెలికాప్టర్ ద్వారా 12.10 గంటలకు మైదుకూరు కోర్టు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.20కి స్థానిక కెఎసి కల్యాణ మండపంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని అక్కడే విలేకరుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. 1 నుంచి 1.45 గంటల వరకు విశ్రాంతి తీసుకుని, 1.55కు బయలుదేరి ప్రొద్దుటూరు రోడ్డులోని వినాయకనగర్‌లోని గృహ సందర్శన నిర్వహించనున్నారు. 2.15 నుంచి స్వేచ్ఛాంధ్ర వాక్ నిర్వహించనున్నారు. 2.45కు పారిశుధ్య వాహనాలను జండా ఊపి ప్రారంభిస్తారు. 3 గంటలకు స్టాల్స్ సందర్శన, స్వచ్ఛఆంధ్రలో భాగంగా ఏర్పాటు చేయనున్న వివిధ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 4 గంటలకు హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. 4.30కు హెలిప్యాడ్‌కు చేరుకొని కడపకు బయలుదేరి ,4.50 నుంచి కడప ఎయిర్పోర్ట్ నుంచి విజయవాడకు వెళ్ళనున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. అందుకు సంబంధించి కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, జిల్లా అధికారులు, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనువాసులరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వెంకటేష్, ముఖ్య నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, భీమయ్య, మునిశేఖర్‌రెడ్డి, గురివిరెడ్డి, మిల్లు శ్రీను, ఎపిరవీంద్ర, కిషోర్ కుమార్ రెడ్డి, జయభారత్ రెడ్డి, చిన్నా, ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పులివెందుల టిడిపిలో విభేదాలు

- రేషన్ డీలర్ పరీక్ష కేంద్రం వద్ద ఉద్రిక్తత
- పరీక్ష రాయడానికి వచ్చిన ప్రకాశ్‌పై దాడి
- మద్దతుగా ఎమ్మెల్సీ భార్య ఉమాదేవి ధర్నా
- దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు
- బీటెక్ రవి అనుచరుల హల్‌చల్



అహోబిలాపురం హైస్కూల్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ భార్య ఉమాదేవి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందులలో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. గురువారం మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రదవి అనుచరులు కడప కలెక్టరేట్‌లో ఇసుక టెండర్ల కోసం హంగామా సృష్టించారు. ఈ సంఘటన మరువకముందే శుక్రవారం పులివెందులలో మరోసారి రెచ్చిపోయారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడు, వేంపల్లెకు చెందిన ప్రకాశ్ రేషన్‌దుకాణం కోసం పులివెందులలోని పాఠశాలలో పరీక్ష రాయడానికి వచ్చారు. ఈ క్రమంలో పరీక్ష రాయడానికి వెళ్లిన అతనిని బీటెక్ రవి అనుచరులు చితకబాదారు. ప్రకాశ్‌ను కిడ్నాప్ చేశారని, అతనిని వదిలి పెట్టాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి భార్య ఉమాదేవి రాతపరీక్ష కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. రాంగోపాల్‌రెడ్డి అనుచరులు అక్కడికి చేరుకోవడంతో రాత పరీక్ష కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పరీక్ష కేంద్రంలోనికి ఎవరిని కూడా వెళ్ళనివ్వకుండా గేటుకు తాళాలు వేసి మరి ధర్నా చేయడంతో పులివెందుల పట్టణంలోని పోలీసులు పరీక్ష కేంద్రం వద్ద మోహరించారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ తమ అనుచరుడైన ప్రకాశ్‌ను పరీక్షకు వెళ్ళనివ్వకుండా వేంపల్లిలోని కొంతమంది కిడ్నాప్ చేశారని అతను పరీక్ష కేంద్రం వద్దకు వచ్చే వరకూ ధర్నాను విరమించేది లేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి జోక్యం చేసుకొని వేంపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులకు ప్రకాశ్ ఎక్కడున్నా పరీక్ష కేంద్రం వద్దకు తీసుకురావాలని అతనిని పరీక్షలో పాల్గొనేలా చూడాలని తెలుగుదేశం పార్టీ నాయకులకు చెప్పడంతో వారు ప్రకాశ్‌ను పరీక్ష కేంద్రం వద్దకు తీసుకువచ్చారు. ప్రకాశ్‌ను తీసుకురావడంతో ఉమాదేవి ధర్నాను విరమించారు. పరీక్ష కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో సిఐలు నరసింహులు, వెంకట రమణ, పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి గుమికూడిన జనాలను చెల్లాచెదురు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

పరీక్షకు రాకుండా అడ్డుకోవడం దారుణం

వేంపల్లిలోని రేషన్‌డీలర్ షాపుకు పరీక్ష రాయడానికి వస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడు ప్రకాశ్‌ను పరీక్ష రాసేందుకు రావడంతో అతన్ని కొట్టడం చాలా దారుణమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి భార్య ఉమాదేవి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ వారికి నచ్చినట్లు బతికే స్వేచ్ఛ ఉందని ఇలా కొట్టడం చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తులు అదే పార్టీకి చెందిన వ్యక్తి ప్రకాశ్‌ను కూడా దారుణంగా కొట్టారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా కొంతమంది వ్యక్తులు ప్రవర్తిస్తున్నారని ఇటువంటి వ్యక్తులను ఉపేక్షించచబమన్నారు. అనంతరం పులివెందుల పోలీసుస్టేషన్లో ఆమెతోపాటు ప్రకాశ్ వెళ్లి దాడి చేసిన వ్యక్తులపైన కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధిపై రేపు సదస్సు : సిపిఎం



కరపత్రాల ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రజా ప్రణాళిక అనే అంశంపై ఈ నెల 19న సిపిఎం జిల్లా కమిటీ నిర్వహించే సదస్సు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో సదస్సు కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టులు, బెంగుళూరు రైల్వే పనులు, కడప ఉక్కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిని అమరావతికి తరలించవద్దని పేర్కొన్నారు. బ్రహ్మసాగర్, వెలుగొండ, సర్వరాయ సాగర్ రిజర్వాయర్లు పూర్తయి దశాబ్దాలు గడుస్తున్నా వాటి కింద పంట కాలవలు, పిల్ల కాలవలు పూర్తి కాకపోవడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదని తెలిపారు. వెంటనే రూ.10 వేల కోట్లు విడుదల చేసి పనులు పూర్తి చేయాలన్నారు. కెసి కెనాల్ స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్ పూర్తి చేయాలని, రాజోలి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు నాలుగు దఫాలు శంకుస్థాపన చేసి శిలాఫలకాల పరిశ్రమగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించి పూర్తి చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి కడప బెంగుళూరు రైల్వేలైన్ వెంటనే పూర్తి చేయాలన్నారు. అరకొరలుగా ఉన్న జిల్లా అభివృద్ధి ఆంధ్ర గ్రామీణ బ్యాంకును, కొప్పర్తి ఇండస్ట్రియల్ క్యారిడార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను, ట్రిబుల్‌ఐటి ప్రిన్సిపల్ సెంటర్‌ను అమరావతికి తరలించకపోవడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజా ఉద్యమం తప్పదన్నారు. సదస్సుకు ప్రధాన భక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు, రాయలసీమ గ్రాడ్యుయేట్స్ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ హాజరవుతారని చెప్పారు. జిల్లాలోని ప్రజల అనుకూల మేధావులు, విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అంజాద్‌బాషాను సన్మానిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కడప


పార్టీని బలోపేతం చేసేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా పిలుపు నిచ్చారు. కడప నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం వైసిపి మహిళ జిల్లా అధ్యక్షులు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, కో-ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, నాయకులు రత్నకుమారి, తులసమ్మ, మల్లేశ్వరి, భాగ్యమ్మ, శివమ్మ, సావిత్రమ్మ, శ్రీదేవి, హైమావతి ఘనంగా సన్మానించి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

నల్సా పథకాలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

నల్సా పథకాలపై న్యాయ సేవల సభ్యులు అందరూ కూడా పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్లో నల్సా పథకములపై న్యాయ సేవల సభ్యులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ బి.ఆర్.సుభాష్ యాదవ్, హెలెన్ కెల్లర్ స్కూల్ మరియు కాలేజ్ కరస్పాండెంట్ పి.దౌలత్ ఖాన్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

టిడిపి కోటి సభ్యత్వంపై హర్షం



కేక్ కట్ చేస్తున్న వికాస్ హరికృష్ణ

ప్రజాశక్తి - కడప

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన, నారా లోకేష్ సారథ్యంలో కోటి సభ్యత్వాల మార్క్ దాటి రికార్డు టిడిపి సృష్టించిందని జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. కడప నగరం స్థానిక అక్కాయపల్లిలోని తన సొంత పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు జిలానీబాషా, టిఎన్ ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివతో కలిసి వికాస్ హరికృష్ణ కేక్ కట్ చేసి కార్యకర్తలను పంచి పెట్టారు. కార్యక్రమంలో 22వ డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, నాయకులు అనిల్, ఉదయ్, విశ్వనాథ్, లోకేష్, రాఘవ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య పోలీసు సిబ్బందికి సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించే మొబలైజేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు చేసే ప్రతీ పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. ఇతర ఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం భిన్నంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్, శివరాముడు, వీరేష్, టైటాస్, ఆర్‌ఎస్‌ఐలు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఆర్‌సి అమలులో జాప్యం తగదు : యుటిఎఫ్



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సిని అమలు చేయడంలో జాప్యం తగదని, తక్షణమే నూతన అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదేళ్ళకొకసారి అమలు చేయాల్సిన పేరివిజన్‌ను అమలు చేయడంలో పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 2023, జులై 1వ తేదీ నుంచి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ పాలకుల విధానాల ఫలితంగా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపా ధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం మాట తప్పి ఉన్న జీతాల్లో కోత విధించి ఉద్యోగులను దగా చేసిందని తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల్ని చెల్లించకపోగా ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ లాంటి సొమ్ములను ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని విమర్శించారు. అందుకు ప్రతిఫలంగానే వైసిపి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేరతాయని, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతుందని భావించి ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి సిపిఎస్ అమలు చేయాలని కోరారు. సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం సాను కులంగా స్పందించకపోతే పోరు బాట పట్టక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహమ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడండి : ఎస్‌టియు

ప్రజాశక్తి-కడప అర్బన్ : రాష్ట్రంలో 117 జిఒ రద్దు తదనంతరం క్లస్టర్ పాఠశాలల ఏర్పాటు, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక ద్వారా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన విధానంలో ఈ ప్రక్రియ ముగిసేలా చూడాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు శామ్యూల్‌కు ఎస్‌టియు ఎపి కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్ రెడ్డి జిల్లా నాయకులు చెన్నకేశవరెడ్డి, ప్రతాపరెడ్డి, మస్తాన్ బాబు, చంద్రమోహన్ రెడ్డి, తులసీదర్, ధర్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఆర్టీసీలో అప్రెంటిస్‌కు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 22న కర్నూలు జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హాజరుకావాలని కడప జిల్లా పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి ఒక ప్రాంతంలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులు చేరుకోవాలని పేర్కొన్నారు.

నగరంలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి శుక్రవారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్, నాగరాజుపేట, కాగితాలపెంట, జిల్లా పరిషత్ అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలను శానిటేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కోటిరెడ్డి సర్కిల్ మెయిన్ రోడ్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి తెల్లవారుజామున ముందుగా ఈ పనులు చేపట్టాలని సూచించారు. నారాయణ కాలేజీ వరకు మెయిన్ రోడ్డును పరిశీలించి, శానిటేషన్ సిబ్బందికి ప్రతిరోజూ తెల్లవారుజామున స్వీపింగ్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, తడి-పొడి చెత్త వేరు చేసే విధానాన్ని చురుకుగా అమలు చేయాలని ఆదేశించారు. క్లాప్ ఆటో వ్యవస్థను పరిశీలించి, ప్రతిరోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రతిరోజు ఇంటర్నల్ డ్రైన్స్ శుభ్రం చేయాలని, డివిజన్ పరిధిలోని బ్రిడ్జిలను రెండు రోజులకు ఒకసారి శుభ్రం చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. కాగితాలపెంట డివిజన్ రోడ్లపై చెత్త కనిపించడంతో, వెంటనే శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. వర్కర్ల హాజరు పరిశీలించి, అనుమతి లేకుండా గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ఎన్‌క్రోచ్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను టౌన్ ప్లానింగ్ విభాగం సమర్పించాలని కోరారు. జిల్లా పరిషత్ అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడి, అల్పాహారం సమయానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్యాంటీన్‌లోని టాయిలెట్ల మరమ్మత్తుల అవసరంపై ఇంజినీరింగ్ శాఖకు తక్షణ చర్యలు చేపట్టమని సూచించారు. భోజన ఏర్పాట్లు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా సమయానికి అందుబాటులో ఉంచాలని క్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు.

రూట అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఖాదర్‌బాషా, నూరుల్లా

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడప అర్బన్ యూనిట్ అధ్యక్షులుగా నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు సి.ఖాదర్ బాషా, కార్యదర్శిగా నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల (సాలె నాగయ్య) ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు జి.ముహమ్మద్ నూరుల్లా, ఆర్థిక కార్యదర్శిగా చింతకొమ్మదిన్నె మండలం లక్కిరెడ్డిపల్లిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ ముజీబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందరేగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ రూట సంఘ బలోపేతానికి, ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'కొప్పర్తి'కి స్టాంప్ డ్యూటీ మినహాయింపు

- ఎన్‌ఐసిడిసి ఇన్‌ఫ్రాలోని 2,595 ఎకరాలకు వర్తింపు

- మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎన్‌ఐసిడిసి కారిడార్ ఇన్‌ఫ్రా కార్పొరేషన్ భూముల బదిలీకి స్టాంప్‌డ్యూటీని రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ మీటింగ్ ఆమోదించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడను ఎన్‌ఐసిడిసి స్కీముకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. కొప్పర్తి పారిశ్రామికవాడలోని సౌత్‌బ్లాక్ ప్రాంతంలో 2,595 ఎకరాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్లాట్లను, రహదారులను, విద్యుత్, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పర చడానికి పెద్దఎత్తున నిధులను కేటాయిస్తోంది. ఎన్‌సిడిఐసి భూముల బదిలీకి స్టాంప్‌డ్యూటీని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం చొరవ నేపథ్యంలో కొప్పర్తి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

తెలుగుగంగ ఎస్‌ఇగా విజయగోపాల్!

ప్రజాశక్తి-కడప ప్రతినిధి : తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విజయగోపాల్ నియమి తులయ్యారు. ప్రభుత్వం శుక్రవారం ఇరిగేషన్ ఇంజినీర్ల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఏడాది కిందటి నుంచి ఇప్పటి వరకు తెలుగు గంగ సూపరింటెండెంట్‌గా ఇరిగేషన్ రెగ్యులర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వెంకటరామ య్య ఇన్‌ఛార్జి ఎస్‌ఇగా డిప్యూటేషన్ కింద చురుకుగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన బదిలీ ఉత్తర్వుల నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాధ్యతలకు పరిమితం కానున్నట్లు తెలుస్తోంది.

రేపు వేమన జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'ప్రజాకవి' వేమన జయంతిని ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, సభాధ్యక్షులుగా ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రధానవక్తగా 'శతావధాని' ఆముదాల మురళి (తిరుపతి) పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు ఎస్.నాగముని వేమన పద్య పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'మేలుకొలుపు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్ :కడపలోని డిఎస్‌ఆర్ కల్యాణ మండపం వేదికగా శనివారం రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు, 'మేలుకొలుపు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సభాసమన్వయం చేయగా ముఖ్యఅతిథిగా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, ఆత్మీయ అతిథులుగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవి, ఆదినారాయణరెడ్డి, నంద్యాల వరదరాజులురెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీలు ఎం.వి.రామచంద్రారెడ్డి, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా హంస అవార్డు గ్రహీత డాక్టర్ నరాల రామారెడ్డి, ప్రముఖ చరిత్ర పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం సహ ఆచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.



జ్యోతిబసుకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిజమైన భూసంస్కరణవాది జ్యోతిబసు

- నేటి యువతకు ఆదర్శనీయులు : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

దేశంలో భూసంస్కరణలు అమలు చేసిన నిజమైన నాయకుడు కామ్రేడ్ జ్యోతిబసు అని, ఆయన నేటి యువతకు ఆదర్శనీయులని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సిపిఎం మండల కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య భవన్‌లో జ్యోతిబసు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గండి సునీల్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సిపిఎం నేతృత్వంలో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఆయన నాయకత్వంలో 25లక్షల ఎకరాలు పేదలకు పంచారని తెలిపారు. 25లక్షల ఎకరాలు కౌలుదారులకు మంజూరు చేశారని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో వరుసగా 5సార్లు సిపిఎం అధికారంలోకి రావడంలో జ్యోతిబసు పాత్ర అమోఘమని కొనియాడారు. ప్రధానమంత్రి పదవిని అధిరోహించవలసి వచ్చినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి పదవిని వదులుకున్నారని తెలిపారు. కమ్యూనిస్టులకు పార్టీ నిర్ణయమే తప్ప వ్యక్తిగత నిర్ణయాలు ఉండవన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, బైరి ప్రసాద్, ఎర్రంపల్లి అజయ్ కార్యకర్తలు భాస్కర్, శీను, ఆంజనేయులు, చిన్నప్ప, రమేష్, అరవింద్, దేవ, ప్రదీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ ప్రసాద్

అతివేగం.. ప్రమాదకరం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అతివేగం ప్రమాదకరమని ఎంవిఐ వెంకట ప్రసాద్, ఆర్‌టిసి డిఎం రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆర్‌టిసి గ్యారేజీలో 36వ జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం డ్రైవర్లు, కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చాలా వరకు మానవ తప్పిదం వల్లే జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఓవర్ టేక్ చేయరాదన్నారు. రోడ్డు మలుపుల్లో అతివేగం పనికిరాదన్నారు. ముఖ్యంగా డ్రైవర్‌కు కంటి చూపు మెరుగ్గా ఉండాలన్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. డ్రైవర్లు ప్రశాంతమైన మనసుతో విధులకు హాజరు కావాలన్నారు. ప్రమాదం జరగకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చెప్పే సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఐఫ్ కులాయప్ప, ఎస్‌బిఐ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కన్వీనర్లను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

నూతన కన్వీనర్లకు సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వైసిపి పట్టణ కన్వీనర్లుగా ఎన్నికైన హాల్ గంగాధరరెడ్డి, హఫీజ్‌ను జెసిఎస్ కన్వీనర్ పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్పలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖాదర్ బాషా, సిద్ధయ్య, పద్మనాభరెడ్డి, డేని, వైసిపి నాయకులు పాల్గొన్నారు


లబ్దిదారుడి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పెన్షన్ లబ్ధిదారుల పరిశీలన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ప్రత్యేక వైద్య బృందం పేర్కొంది. మండలంలోని నరాల బలహీనత, పక్షవాతం కలిగిన 35 మంది పెన్షన్ లబ్ధిదారులను ప్రత్యేక వైద్య బృందం పరిశీలించింది. వైద్యులు నరసింహం, శ్రీహరిలు శుక్రవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వ్యాధికి సంబంధించి రికార్డులను, ప్రస్తుత పరిస్థితిని గమనించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణమూర్తి, సింహాద్రిపురం వైద్యాధికారి షేక్ హుస్సేన్ పీరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మిరెడ్డికి ఘన సత్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా మత సామరస్యానికి ప్రతీకని, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి ఆకాంక్షించారు. ఆ మేరకు శుక్రవారం ఆయన రవీంద్ర నగర్‌లో ఉన్న సయ్యద్ షాగౌస్ తర్లర్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గాలో ప్రార్థన చేశారు. అనంతరం పీఠాధిపతి సయ్యద్ షా ఇలియాస్ బాషా ఖాదీ లక్ష్మిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓబులరెడ్డి, మహమ్మద్ పాల్గొన్నారు.


లక్ష్మిరెడ్డిని సత్కరిస్తున్న పీఠాధిపతి

జాతీయ రహదారులు.. పొంచి ఉన్న ప్రమాదాలు

మరమ్మతులకు నోచని సర్వీస్ రోడ్లు - నిర్వహణను మరిచిన ఎన్‌హెచ్ఎఐ


పూసల కొట్టాల వద్ద దెబ్బతిన్న ఎన్‌హెచ్ సర్వీస్ రోడ్డు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప-కర్నూలు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. జాతీయ రహదారులను పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్ఎఐ సంస్థ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వాహనదారుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇటీవల ఖాజీపేట-చెన్నూరు మార్గ మధ్యన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ మార్గంలో పలుచోట్ల పాత తార రోడ్డును తవ్వి కొత్తగా తార రోడ్డు, రహదారి పనులు చేపట్టారు. రహదారికి సంబంధించి పాత తార రోడ్డు కంకరను రోడ్డుకు ఇరువైపులా అక్కడే కుప్పలుగా ఉంచేశారు. ఈ కుప్పలు వాహనదారులకు ప్రమాదాలను తెచ్చిపెడుతెన్నాయి. వీటిని తొలగించాల్సిన జాతీయ రహదారి విభాగ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న పాత తార రోడ్డు కంకర కుప్పలుగా ఉండడం వల్ల రాకపోకలకు సమస్యగా మారింది. జాతీయ రహదారి వెంబడి పలు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్లు కూడా ప్రమాదకరంగా ఉంటున్నాయి. సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారి సమీప మార్గాన ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు పలుచోట్ల పూర్తిగా దెబ్బ తిన్నాయి. వాహనాల రాకపోకల సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోందని, సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు మార్గాన ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ఎలాంటి సూచికలు లేవు. ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల నిర్వహణ తీరును పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్ఎఐ అధికారులు శ్రద్ధ వహించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పాటిమీద పల్లె సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఫాస్ట్రాగ్ సాంకేతిక సమస్య తరచూ తలెత్తుతోందని, వాహనాలు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నాయి. సమయం వృథా అవుతోందని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టోల్ ఫీజ్ వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ జాతీయ రహదారి నిర్వహణలో ఎందుకు చూపడంలేదని లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖాజీపేట సమీపంలోని పుల్లూరు, పూసల కొట్టాల వద్ద అయ్యప్ప స్వామి ఆలయానికి సమీపాన జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల తిప్పలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సు షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, బ్యాగులతో నడిరోడ్డుపై ఉంటున్నారు. పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు మళ్లీ తమ గమ్యం చేరుకునేందుకు బస్సు కోసం మఠం ఐదు రోడ్ల కూడలిలో ఉండాల్సి ఉంది. అయితే అక్కడ బస్ షెల్టర్‌లేదు. పిల్లలు, లగేజీ బ్యాగ్‌లతో నడి రోడ్డు పై కూర్చొని వేచి చూడ వలసిన పరిస్థితి. వివిధ దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు రోడ్లపై బస్సు కోసం వేచి ఉండడం చూసిన వారు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. మఠం ఎప్పుడు అభివృద్ధి చెందుతుందో..ఎవరు పట్టిం చుకుంటారోనని ఎదురుచూస్తున్నారు. సొంత మండలం అని చెప్పుకునే మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ అయినా మఠం అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మఠం మండలంలో ఎమ్మెల్యేకు పోటీ చేసేంత నాయకులు ఉన్నప్పటికీ ప్రజలను ఓటర్లుగానే చూస్తున్నారే తప్ప, మఠం అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడంలేదంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.


బస్సు కోసం ఎండలో వేచివున్న ప్రయాణికులు

ప్రతి రైతూ ఇకెవైసి తప్పక చేయాలి


పంట పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట నమోదు పూర్తియిన ప్రతి రైతుకూ ఇకెవైసి చేయాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులు, రైతుల వివరాల రిజిస్టర్లు సక్రమంగా రాసి అప్డేట్ చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. మండలంలోని తిమ్మాపురం, పెనికలపాడు రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఎఒ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకెవైసి పక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో లేకుండా దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు ఫోన్ ద్వారా ఒటిపి తెలిపి ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ కోరారు. అనంతరం రాజుల గురువాయపల్లెలో సాగులో ఉన్న శనగ పంటను పరిశీలించి రైతులకు సలహాలిచ్చారు. వేరు శనగ పంట పూత ఊడలు దిగే సమయంలో ఎకరానికి 5 బస్తాలు జిప్సం వేస్తే కాయ నాణ్యత పెరిగి నూనె శాతం బాగా వస్తుందన్నారు. మంచి దిగుబడులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి లాభదాయకం

చాపాడు : మండలంలోని సోమాపురం, మొర్రాయిపల్లెలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మ్యాగీ ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడి, మార్కెట్ ధరల గురించి రైతులతో చర్చించారు. రబీ సీజన్‌లో వరి వేసే రైతులు నారు పోసుకోవడానికి ముందే విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. తద్వారా పంటలో చీడపీడల నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. వివిధ పంటలకు సంబందించి ఎరువులు, పురుగుమందుల యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వివిఎ ఎం.పుష్పలత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఎఒ మ్యాగీ

సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళతాం

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయా లని కోరతామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదు కూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఆయన టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, జిల్లాస్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మైదుకూరులో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి జిల్లాపై ఉన్న ఇష్టం ఈ కార్యక్రమం ప్రారంభంతోనే తెలుస్తుందన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి రాష్ట్రస్థాయి కార్యక్రమం మైదుకూరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని నాయకులు విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మైదుకూరు ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన రాజోలి ఆనకట్ట నిర్మాణం ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. 100 పడకల ఆసుపత్రి, నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోని శ్మశానాలకు ప్రహరీలు, ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంతభవనాలు, పాలిటెక్నిక్ కళాశాలకు భవనం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికుల ఏర్పాటు వంటి సమస్యలను ముఖ్యమంత్రికి వివరిస్తామన్నారు. గతంలో మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.98కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించినప్పటికీ నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం వాటిని ఇప్పుడు మంజూరు చేయిస్తామన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక కెఎస్‌సి కల్యాణమండపంలో నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పుట్టా' పక్కన ఆర్.శ్రీనివాసరెడ్డి

రెండు తలలతో గొర్రె పిల్ల జననం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని గూడెంచెరువులో రెండు తలలతో గొర్రె పిల్ల జన్మించిందని ఆగ్రామ పశువుల డాక్టర్ జాన్ సుధాకర్ తెలిపారు. గూడెంచెరువు గ్రామంలోని రైతు గుడ్ల నాగేష్ గొర్రెలు పెంచుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో ఒక గొర్రె రెండు తలలు కలిగిన పిల్లకు జన్మించిందని తెలిపారు. ప్రస్తుతానికి ఆ పిల్ల ఆరోగ్యంగా ఉందన్నారు. ఈ గొర్రె పిల్లను చూసేందుకు గూడెం చెరువు గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా చూస్తున్నారు.



గతుకులకు అతుకులు ఎప్పుడో..!

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని పలు గ్రామాల వద్ద ఉన్న గోతులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. కడప-పులివెందుల వెళ్లే ప్రధాన రహదారిపై పలు గ్రామాల వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వీటితో అనునిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేంపల్లెలోని ప్రధాన రహదారిపె, గ్రామంలోని ప్రధాన రహదారులపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్రాంతిలోపు రహదారులను సుందరంగా తీర్చి దిద్దుతామని, గోతులు లేని రహదారులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గుంతలు లేని రోడ్లు వేస్తామని ప్రకటనలు గుప్పించినా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించిన ప్రజాప్రతినిధులు ఈ రహదారుల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు బహి రంగంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు ఈ రహదారులపై అనునిత్యం ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్న ప్పటికీ సంబంధిత రోడ్డు భవనాల శాఖ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గోతులు లేని రోడ్లుగా మార్చేందుకు గతుకుల రోడ్లకు అతుకులు వేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.


రోడ్లుపై గోతులు పడడంతో నిలిచిన నీరు


మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

జిల్లాపై కక్ష సాధింపు దురదృష్టకరం

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాపై కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష కట్టడం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు టిడిపి కూటమి అభ్యర్థులను బలపరిచినప్పటికీ జిల్లాకు అన్యాయం చేస్తునే ఉన్నారని విమర్శించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలైందన్నారు. ఈ కాలంలో జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం లేదన్నారు. గతంలో జిల్లా నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించేవారని చెప్పారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా జిల్లా నుండి లేకపోవడం శోచనీయమన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా అన్యాయమేనని తెలిపారు. పుష్పకవిమానం వంటి టిటిడి బోర్డులో కూడా కడప జిల్లా నుంచి ఒక్కరూ కూడా లేరన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా కడప జిల్లా సున్నితమైన, కీలకమైన జిల్లా అన్నారు. రెండున్నర నెలలుగా ప్రభుత్వం కడపకు రెగ్యులర్ ఎస్‌పిని నియమించకపోవడం దారుణమన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువ కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, సుబ్బరాయుడు, వెంకటేష్, రమణ, మహబూబ్ బాషా, వేమా రాజా, వేమయ్య, బద్రి, రవి, మదార్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వేల్పుల రాము

వ్యక్తిగత విమర్శలు తగవు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నీతి నిజాయితీగా బతుకుతున్న తనపై వ్యక్తిగత విమర్శలు తగదని వైసిపి నాయకులు వేల్పుల రాము పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన వేముల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కొళ్లగొట్టడమే ధ్యేయంగా పని చేస్తున్నది తమరేనని టిడిపి నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. వ్యవస్థలను నాశనం చేసి దోచుకో దాచుకో అన్న రీతిలో టిడిపి నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. వాస్తవాలు తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మీడియా ముందు మాట్లాడడం మంచిది కాదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.కోట్ల విలువ చేసే ఖనిజాలన్నీ దొంగలించబడ్డాయని, వాటిని ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు. బైరైటీస్‌ను కాపాడేందుకు అనేకసార్లు అధికారులకు రక్షణ కల్పించాలని వినతి పత్రాలు పెట్టామని, ఎవరూ స్పందించలేదన్నారు. రూ.10 నుంచి రూ.15 కోట్ల సరుకును కూటమి నాయకులు రాత్రికి రాత్రి తరలించారని ఆరోపించారు. తాను దోచుకుని ఉంటే వేముల మండల ప్రజలు తన వెంట ఉండేవారు కాదన్నారు. ఎప్పుడూ నా వెంటే ఉంటారన్నారు. వేల్పులలో నాలుగు సార్లు సర్పంచ్‌గా గెలిచామన్నారు. ఇప్పటికీ తమ గ్రామంలో తాను సూచించిన వ్యక్తి సర్పంచు, ఎంపిటిసిగా గెలిపిస్తున్నారని తెలిపారు. ఇదే నా వెంట ప్రజలు ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. వైఎస్ కుటుంబ సభ్యుల కోసం తన ప్రాణాలను అర్పించడానికి సిద్ధమన్నారు. నెలలో 20 రోజులు కుటుంబానికి దూరంగా ఉంటూ.. పనులు చేసుకుంటున్నానని తెలిపారు. తన టర్నోవర్ రూ.110 కోట్లు ఉందని, తనది తెరిచిన తెల్ల కాగితమన్నారు. ఎప్పుడైనా విచారణ చేయించుకోవచ్చని రాము వివరించారు. ప్రభుత్వం వచ్చిందని ప్రజలకు సేవ చేసే ప్రయత్నం చేయాలని ఆయన హితవు పలికారు.

ఫైర్ అధికారిగా శివరామిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లె అగ్నిమాపక కేంద్ర అధికారిగా శివరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. సత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి శివరామిరెడ్డి ఉద్యోగోన్నతిపై వేంపల్లె అగ్నిమాపక కేంద్రానికి బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఈ ప్రాంత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శివరామిరెడ్డిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే సకాలంలో తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఎఇ ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్, హనుమన గుత్తి రోడ్డు, కడప రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, వేంపల్లి రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కెవి పల్లి, మాలెపాడు, చిన్న దండ్లూరు, ఆర్‌టిపిపి, కలమల్లతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా మధ్యాహ్నం వరకు ఉండదని వివరించారు. విని యోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఎఇ కోరారు.

చక్రాయపేట : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపే స్తున్నట్లు ఎఇఇ ప్రవీణ్ కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. చక్రాయపేట ఫీడర్ పరిధిలోని ఆయా విద్యుత్ సబ్ స్టేషన్లు మరమ్మతులు చేస్తునందున ఎల్‌సి తీసుకున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహదేవిపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపేస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.